# కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు బూటకం

**● సాధ్యం కాని హామీలను ప్రజలు నమ్మొద్దు: ఇంటింటి ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్**

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 11: కాంగ్రెస్ పార్టీ చెబుతున్న ఆరు గ్యారెంటీ పథకాలు పచ్చి బూటకమని, సాధ్యం కాని హామీలను ప్రజలు నమ్మొద్దని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని 12వ వార్డులోని పిల్లికోటాల్, రషీద్‌కాలనీ, వడ్డెర కాలనీల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి పక్షాన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో, ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. మ్యానిఫెస్టో ప్రతులను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్ పార్టీ ఎత్తుగడ వేస్తున్నదని, 60 ఏండ్లలో జరగని అభివృద్ధి కేవలం తొమ్మిదేండ్లలో మెదక్ నియోజకవర్గాన్ని పద్మాదేవేందర్‌రెడ్డి చేసి చూపించారన్నారు. ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత మాటలను నమ్మవద్దని సూచించారు. నిరంతరం ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడే పద్మాదేవేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ప్రచారంలో వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, మాజీ కౌన్సిలర్ గౌశ్ ఖురేషి, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు నగేశ్, నాయకులు కసాపురం మధు, శివరామకృష్ణ, వెంకటనారాయణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పిల్లికోటాల్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

## ప్రజలకు కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు



కలెక్టర్ రాజర్షి షా

మెదక్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): అజ్ఞానాన్ని తొలిగించి జ్ఞాన దీపాన్ని వెలిగించడమే దీపావళి అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. చెడుపై సాధించిన విజయానికి ప్రతీక దీపావళి అని, దీపావళి పండుగకు జిల్లా ప్రజలు కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని, చేపట్టే ప్రతి కార్యక్రమంలో విజయాలు చేకూరాలని, ఆకాంక్షిస్తూ ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ నైతిక బాధ్యతగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

## బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ కార్యకర్తల చేరిక

రామాయంపేట రూరల్, నవంబర్11: రామాయంపేట మండలంలోని దంతేపల్లి, గిరిజన తండాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శనివారం మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. పద్మాదేవేందర్‌రెడ్డి విజయం కోసం సమిష్టిగా కృషి చేస్తామని పార్టీలో చేరిన కార్యకర్తలు పేర్కొన్నారు.

## రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి



బీఆర్ఎస్ మెదక్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 11: పాలకుర్తిలో జరిగిన కాంగ్రెస్ సభలో దళిత యువకుడిని కాలితో తన్నిన టీపీసీసీ ఆధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మెదక్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత యువకుడిని తన్నడాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే దళితులకు అన్ని విధాలుగా న్యాయం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దళితుల కోసం దళితబంధు లాంటి పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీలో దళితులకు ప్రాధాన్యత కరువైందన్నారు. దళితులపై దురుసుగా ప్రవర్తించిన రేవంత్‌రెడ్డిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.





మెదక్ పట్టణంలో ప్రమిదలు, బంతిపూలు కొనుగోలు చేసున్న ప్రజలు

# మార్కెట్‌కు దీపావళి సందడి

**● ఊపందుకున్న ప్రమిదలు, బంతిపూలు, గుమ్మడికాయలు, బాణాసంచా కొనుగోళ్లు**

మెదక్ రూరల్, నవంబర్11: మెదక్ జిల్లాకేంద్రంతో పాటు అన్ని మండలాల్లో మార్కెట్లు దీపావళి శోభను సతరించుకున్నాయి. పండుగ సందర్భంగా రద్దీ విపరీతంగా పెరిగింది. దీపావళి పండుగ రోజు ఇంటింటా ప్రమిదలు వెలిగించడంతో పాటు దొంతులను ఏర్పాటు చేసి లక్ష్మీ పూజలను ఘనంగా నిర్వహిస్తారు. ప్రమిదలు, దొంతులు లక్ష్మీమాత విగ్రహాలు , బంతిపూలు, గుమ్మడికాయలు, పూజా సామగ్రి, బాణాసంచా అమ్మకాలు జరుపుతుండటంతో మార్కెట్‌లో పండుగ వాతావరణంలో నెలకొన్నది. వ్యాపారులు ఒక రోజు ముందు నుంచే ధరలు పెంచి అమ్మకాలు జరుపుతున్నా రు. మూడు రోజులనుంచే దీపావళి సామగ్రిని కొనుగో లు చేస్తున్నారు. స్వీట్స్ విక్రయాల వద్ద కొనుగోలుదారులతో సందండి నెలకొన్నది. గ్రామాలకు వెళ్లే బస్సుల్లో రద్దీ కనిపించింది. యువకులు, చిన్నారులు బాణాసంచా జోరుగా కొనుగోలు చేస్తున్నారు.

## రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో పల్లవికి బంగారు పతకం



విద్యార్థిని పి.పల్లవి

మెదక్ అర్బన్, నవంబర్11: భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థలు రాష్ట్ర స్థాయిలో ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మెదక్ జడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని పి.పల్లవి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఇటీవలే 'కాలమును వృథా చేసినా–జీవితం వృథా చేసినట్లే' అంశంపై పాఠశాల స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పి.పల్లవి బంగారు పతకాన్ని సాధించినట్లు 'సత్యసాయి సేవా సంస్థ' జిల్లా అధ్యక్షుడు శిరగ ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగారు పతకాన్ని ఈనెల 21 ప్రశాంతి నిలయం పుట్టపర్తిలో జరిగే ఉత్సవంలో ప్రదానం చేస్తామని ఆయన వెల్లడించారు.

## రూ.54 వేలు నగదు పట్టివేత



చెక్‌పోస్టు వద్ద నగదు పట్టుకున్న ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట, నవంబర్ 11: నస్కల్ ఎక్స్ రోడ్డు వద్ద స్థానిక పోలీసులు, కేంద్ర భద్రత బలగాలు సంయుక్తంగా చేసిన తనిఖీలో ఓ వ్యక్తి వద్ద రూ.54 వేల నగదు పట్టుబడింది. ఎన్నికల నేపథ్యంలో శనివారం చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌కు చెందిన శ్రీధర్‌రెడ్డి వద్ద రూ.54 వేలు పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రూ.50 వేలకు మించి డబ్బులను తమ వెంట తీసుకువెళ్లవద్దని, తప్పనిసరి పరిస్థితిలో నగదుకు తీసుకువెళ్తే అందుకు తగిన రసీదు వెంట ఉంచుకోవాలని ఎస్సై సూచించారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.



'విశ్వరూప మహాసభ'కు రామాయంపేట నుంచి తరలివెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## 'విశ్వరూప మహాసభ'కు తరలిన ఎమ్మార్పీఎస్

రామాయంపేట, నవంబర్ 11: సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో 'మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభ'కు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్న నేపథ్యంలో శనివారం రామాయంపేట నుంచి అధిక సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. రామాయంపేట నుంచి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మల్యాల కిషన్ ఆధ్వర్యంలో గొల్పర్తి, కోమటిపల్లి, రామాయంపేట నుంచి పెద్ద ఎత్తున మోదీ సభకు తరలివెళ్లారు. హక్కుల సాధన కోసం తాము 'మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభ'కు తరలివెళ్తున్నట్లు కిషన్ తెలిపారు.



చిరుత దాడిలో చనిపోయిన లేగ దూడ

## చిరుత దాడిలో లేగదూడ మృతి

పాపన్నపేట, నవంబర్11: పాపన్నపేట మండల పరిధిలోని అన్నారం గ్రామ శివారులో శనివారం తెల్లవారుజామున ఓ చిరుత దాడి చేసి లేగ దూడను చంపేసినట్లు టేక్మాల్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు అన్నారం తండాకు చెందిన మునియా నాయక్ గ్రామ శివారులోని కొట్టంలో తన పశువులను కట్టివేశాడు. తెల్లవారి లేచి చూసేసరికి లేగ దూడ చనిపోయి ఉంది. ఆ ప్రదేశంలో పాదముద్రల ఆధారంగా లేగ దూడను చిరుత చంపినట్లు గుర్తించారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పశువుల కాపరులు అన్నారం అటవీ ప్రాంతంలో ఒంటరిగా సంచరించరాదని , గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## ఊరు బాగుకోసం యువకుల శ్రమదానం

రామాయంపేట, నవంబర్ 11: హరితహారంలో భాగంగా తమ ఊరు పచ్చదనంతో ఉండాలనే ఉద్దేశంతోనే రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలిగిస్తున్నామని సుతారిపల్లి గ్రామ యువకులు తెలిపారు. శనివారం రామాయంపేట మండలం సుతారిపల్లికి చెందిన యువకులు తమ గ్రామం మండలంలో ఆదర్శంగా ఉండాలనే ఉద్దేశంతోనే తామంతా శ్రమదానంతో చెట్ల వద్ద ఉన్న గడ్డి, పిచ్చిమొక్కలను తీసేస్తున్నామన్నారు. ఖాళీ ప్రదేశాల్లో ఆక్సిజన్ మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా తామే తీసుకుంటామన్నారు. యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామానికి వెళ్లే దారిలో దారి పొడవునా ఉన్న పిచ్చి మొక్కలను, గడ్డిని తీసివేయడం హర్షించదగ్గ విషయమని గ్రామస్తులు, సర్పంచ్ సంధ్య ఉమామహేశ్వర్ యువకులను అభినందించారు.



సుతారిపల్లి వెళ్లే రోడ్డులో పిచ్చి మొక్కలను తొలిగిస్తున్న యువజన సంఘం నాయకులు